
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 26 ఆగస్టు 2025 | 5





ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న విద్యాశాఖ ఏడీ రామలింగం, ఆర్‌జేడీ నాగమణి

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- మంత్రి లోకేశ్ చొరవతో ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో ఉత్సవ కమిటీలకు ఊరట
- వచ్చేనెలలో విజయదశమికి ఏర్పాటు చేసే మండపాలకూ ఉచిత విద్యుత్ సౌకర్యం

పిఠాపురం,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలు, పందిర్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్సవాలు జరిగే అన్నిరోజుల్లో ఉచిత విద్యుత్ అందజేయాలని వివిధ గణేష్ ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులు రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో ఆయన చర్చించారు. దీంతో ఉచిత విద్యుత్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని లోకేశ్ ట్విట్టర్(ఎక్స్), ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. దసరా సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు కూడా ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు.

విద్యుత్ భారం నుంచి ఉపశమనం

వినాయక చవితి సందర్భంగా జరిగే నవరాత్రి ఉత్సవాలు జరిగే అన్ని రోజులకు విద్యుత్ సరఫరా నిమిత్తం నిర్వాహకులు తాత్కాలిక కరెంటు కనెక్షన్ తీసుకోవడం లేదా ఇతర కనెక్షన్లనుంచి సరఫరా తీసుకుని సొమ్ములు చెల్లించేవారు. ఇప్పుడు ఆ బాధ తప్పింది. దీనివల్ల కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో 7,500 పెద్ద, మధ్య తరహా వినాయక మండపాలు, మరో 10వేల వరకూ చిన్నతరహా మండపాలు, పందిర్ల నిర్వాహకులకు ఉపశమనం కలగనుంది. ఈ మండపాలన్నింటికీ ఉచిత విద్యుత్ ఎలా అందించాలనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. దానికి అనుగుణంగా కరెంటు కనెక్షన్లు ఇస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.25కోట్లు, ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.4కోట్ల వరకూ ఉచిత విద్యుత్‌కు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం భరించనుంది. మండపాలకు ఉచిత విద్యుత్ అందించేలా చొరవ తీసుకున్న మంత్రి నారా లోకేశ్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విస్తృత ఏర్పాట్లు

- 28న గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశీలన ప్రక్రియ
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 1241 అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- పరిశీలకుడిగా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం నియామకం

6

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 190 అర్జీలు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా అధికారులు నిబద్ధతతో పనిచేసి అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధప్రాంతాలనుంచి వచ్చిన వారినుంచి కలెక్టర్‌తోపాటు జేసీ టి.నిషాంతి, డీఆర్వో కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, డీఎల్డీవోలు రాజేశ్వరరావు,త్రినాథరావు 190అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీపీవో డి.శాంతలక్ష్మి, డీఈవో సలీంబాషా పాల్గొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం మండలాలు, రామచంద్రపురం పురపాలక సంఘాన్ని పరిపాలనా సౌలభ్యంకోసం కాకినాడలో కలపాలని ద్రాక్షారామ, వెలమపాలెం, ఉండూరు, వేగాయమ్మపేట, అముజూరు, గంగవరం పీఏసీఎస్‌ల అధ్యక్షులు ముప్పనపల్లిగణేష్, మేడిశెట్టి రాధాకృష్ణ,మేకా జానకిరామయ్య, పెంకే గోవిందరాజు, నేమన సత్యనారాయణ, గాలి వెంకటేష్ అర్జీ అందించారు.

ఎస్పీకి 23 అర్జీలు

అమలాపురం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాపోలీసు కార్యాలయంలోప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చినవారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలపై 23 అర్జీలను స్వీకరించారు. నిర్ణీత గడువులోగా సమస్యను పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు.

ఎవరికిస్తారో?

- త్రిసభ్య కమిటీ పరిశీలనలో టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి
- మంత్రి కొల్లు, ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, టీఎన్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు భేటీ
- పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ముఖాముఖి సమావేశాలు
- ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి మూడేసి పేర్లు సిఫార్సు



అమలాపురంలో జరిగిన జిల్లాస్థాయి టీడీపీ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అమలాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాస్థాయి టీడీపీ ముఖ్యనేతల సమావేశం సోమవారం జిల్లా కేంద్రమైన అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. కీలక సమావేశానికి పార్టీ అధిష్ఠానం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్ర మైన్స్ అండ్ ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ముఖ్యఅతిథులుగా హాజరైన ఈ కీలక సమావేశం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. జిల్లాస్థాయిలో పార్టీ అధ్యక్షుడి నియామకంతోపాటు వాటి అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకానికి సంబంధించి ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న కీలక నాయకుల అభిప్రాయసేకరణ నిర్వహించారు. తొలుత జిల్లాలోని ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించిన తర్వాత త్రిసభ్య కమిటీ సభ్యులు జిల్లాలోని పార్టీముఖ్యనాయకులతో ముఖాముఖిగా చర్చించి వారి అభిప్రాయాలను మంత్రి కొల్లు రవీంద్ర సహా మిగిలిన సభ్యులు కూలంకుషంగా నమోదు చేసుకున్నారు. జిల్లా కమిటీలకు సంబంధించి సిఫార్సులు చేసే నాయకుల పేరును నమోదు చేసుకుని వారికి సంబంధించి పార్టీశ్రేణుల మద్దతుపై కూడా నాయకుల నుంచి కీలకంగా రాబట్టారు.

సామాజికవర్గాలవారీగా పోటీ

కోనసీమ జిల్లాస్థాయి టీడీపీ అధ్యక్ష పదవికి దశాబ్దాల కాలం నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకులనుంచి ఇటీవల పార్టీలోకి వచ్చిన నాయకుల వరకు ఎవరికి వారే తమ పేర్లను సిఫారసు చేయాలంటూ మంత్రి కొల్లు రవీంద్ర, చీఫ్ విప్ ఆంజనేయులు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రఘురామరాజులకు వివరించారు. ఓసీ సామాజికవర్గంనుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, తెలుగు యువత నాయకుడు గంధం పల్లంరాజు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాయిరామ్, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మీనారాయణసహా పలువురు పోటీపడినట్టు సమాచారం. మెట్ల రమణబాబు పేరు ఎక్కువమంది ఆమోదించినట్టు విశ్వసనీయ సమాచారం. షెడ్యూల్డ్ కులాలనుంచి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్, టీడీపీ రాష్ట్ర హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు పేర్లు పరిశీలించగా అత్యధికులు ఎమ్మెల్యే ఆనందరావుకు మద్దతు తెలిపినట్టు సమాచారం. బీసీసామాజికవర్గం నుంచి ప్రస్తుత జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, మాజీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, పార్టీ జిల్లామహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ కార్యదర్శి గుత్తుల సాయిశ్రీనివాస్, డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి పోటీపడినట్టు సమాచారం. వీరిలో రెడ్డిసుబ్రహ్మణ్యం, పెచ్చెట్టి విజయలక్ష్మి పేర్లకు అధికులు సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. అమలాపురం పార్లమెంటరీ తెలుగు రైతు విభాగం అధ్యక్షుడిగా మట్టా మహలక్ష్మిప్రభాకర్ పేరును పలువురు బలపరచగా ఆయన పేరు ఖరారైనట్టేనని సమాచారం. జిల్లాలో పార్టీ పదవులకు సంబంధించి పేర్లను త్రిసభ్య కమిటీ సేకరించి ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లకు నివేదించనున్నట్టు సమాచారం.

పార్టీ నేతల మనోభావాలను అధిష్ఠానం ముందు ఉంచుతా: మంత్రి కొల్లు

నేతల అభిప్రాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి కొల్లు రవీంద్ర హామీఇచ్చారు. పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి అధ్యక్షతన నిర్వహించగా మంత్రి కొల్లు రవీంద్ర, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, టీఎన్‌టీయూసీఅధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజుతోపాటు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావుతోపాటు జడ్పీ మాజీచైర్మన్ నామన రాంబాబు, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు,రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు,నాయకులు మోకా ఆనంద్‌సాగర్, పెచ్చెట్టి చంద్రమౌళి, పలువురు నేతలు ప్రసంగించారు.



మట్టి గణపతే.. మహో గణపతి

6

మట్టి గణపతే మహా గణపతి అంటున్నారు.. రంగు రంగుల విగ్రహాలను వదిలి మట్టి గణపతుల వైపు భక్తజనం చూస్తున్నారు.. దీంతో మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది.. పందిళ్లలోకి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ భారీ విగ్రహాలను వినియోగిస్తుండగా.. ఇళ్లల్లో పూజ చేసుకునే భక్తులు మాత్రం మట్టి విగ్రహాలకే జై కొడుతున్నారు.. బుధవారం వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో ఎక్కడ చూసినా బుల్లి బుల్లి మట్టి విగ్రహాలే దర్శనమిస్తున్నాయి..

మట్టి గణనాథుడినే పూజిద్దాం: కలెక్టర్



మట్టి గణనాథులనే ఉపయోగించాలనే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పు, హాని కలిగించకుండా గణపతి ఉత్సవాలను జరుపుకోవడానికి మట్టి గణపతి విగ్రహాలను ఉపయోగించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాలకు మట్టిప్రతిమలను ఉపయోగించాలంటూ రూపొందించిన వినాయక చవితి ప్రచార గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాలను వాడడంవల్ల పర్యావరణ హితానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మట్టివిగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోతాయని, తదనుగుణంగా నదులు, చెరువులు, సముద్రాలు కలుషితం కావన్నారు. ప్లాస్టర్ ఆఫ్‌పారిస్ విగ్రహాల్లో ఉండే రసాయనాలు నీటిలో ఉండే చేపలు, ఇతర జీవులకు హాని చేస్తాయన్నారు. మట్టివిగ్రహాలు, ఆ ముప్పును నివారిస్తాయన్నారు. చాలాచోట్ల మట్టిగణపతులు అందుబాటులోఉన్నాయని, మీరు వాటి కొనుగోలు ద్వారా స్థానిక కళాకారులను ప్రోత్సహించినట్లు ఉంటుందని తెలిపారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రణీత పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ముమ్మిడివరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ప్రధాన ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉపాధ్యాయ పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో సలీంబాషా తెలిపారు. పదేళ్ల ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం కలిగిన అన్నికేటగిరీలకు చెందిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు జిల్లాస్థాయి ఉపాధ్యాయ పురస్కారానికి ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పురపాలక యాజమాన్యాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న కనీసం పదేళ్ల టీచింగ్ అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తనిఖీ అధికారుల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ఆగిన ఉపాధి

- నెలరోజులుగా నిలిచిన ఉపాధి హామీ పనులు
- రూ.60కోట్లపైనే వేతన బకాయిలు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (పాతచిత్రం)



అమలాపురం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జిల్లాలో నిలిచిపోయాయి. తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోతెలియని పరిస్థితి. చేసిన పనులకు మూడునెలలుగా వేతనాలు విడుదలకాలేదు. నెలరోజులుగా జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు నిలిచిపోయాయి. జిల్లాలో 1.53లక్షల మందికి ఉపాధి హామీ పనుల్లో జాబ్‌కార్డులు అందించారు. కూలీలకు ఉపాధి హామీగా ఈ పథకాన్ని కేంద్రం అమలులోకి తీసుకువచ్చింది. ఈ ఏడాది మే 21 వరకు చేసిన పనులకు కూలీలకు వేతనాలు చెల్లించగా ఆ తర్వాత ఇప్పటివరకు కేంద్రం నిధులు విడుదల చేయలేదని సమాచారం.

లక్ష్యానికి మించిన పనులతోనే..

ఉపాధి హామీ పథకంలో ఏడాదికి జిల్లాలో 30లక్షల పనిదినాలు కల్పించడం లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 44 లక్షల పనిదినాలు కూలీలకు కల్పించారు. కేంద్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా 30లక్షల పనిదినాలతో వేతనాలను విడుదల చేసింది. మిగిలిన 14లక్షల పనిదినాలకు సంబంధించి రూ.60కోట్ల పైబడి వేతన బకాయిలు విడుదల చేయాల్సి ఉంది. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు ఎక్కువగా పొందేందుకు కూలీలతో లక్ష్యానికి మించి పనులు చేయించడంవల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. నెలరోజులుగా ఉపాధిహామీ పథకం కింద పనిచేసే క్షేత్రసహాయకులు, మేట్లు, కార్యాలయ సిబ్బంది పనులు లేక ఖాళీగా ఉన్నారు. పలుచోట్ల వేతన బకాయిల కోసం కూలీలు క్షేత్ర సహాయకులను సొమ్ములు ఎప్పుడు చెల్లిస్తారో అని నిలదీస్తున్నారు. ఇప్పటికైనాఉన్నతాధికారులు స్పందించి వేతనబకాయిల విడుదలకోసం కృషిచేయాలని, తమకు పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు

హైదరాబాద్ గచ్చిబౌలిలో రేవ్ పార్టీ
- ఇద్దరు జిల్లా వాసుల అరెస్ట్!

7

7న సత్యదేవుడి ఆలయం మూసివేత

కేరళ తరహాలో కోనసీమ అభివృద్ధి

- ఇందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రణాళికలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- అమలాపురంలో పార్టీ శ్రేణులతో సభ
- ఎమ్మెల్సీ వీర్రాజుతో కలిసి సారథ్యయాత్ర
- రైల్వేలైన్‌ను అభివృద్ధి చేస్తాం: చాయ్‌పే చర్చలో మాధవ్



సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

అమలాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో కోనసీమ ప్రాంతం అన్నివిధాలుగాను అభివృద్ధి సాధించేలా ఎన్డీఏ ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సారథ్య యాత్రలో భాగంగా సోమవారం అమలాపురంలో పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొబ్బరి, తాటిచెట్లు ఎక్కే కార్మికుల కోసం ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వం ప్రత్యేక బీమా సౌకర్యాన్ని అమలు చేస్తుందన్నారు. దీనిలోభాగంగా కేంద్రం 75శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం ప్రీమియం చెల్లించేలా ఈ స్కీముల అమలువల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉండే కొబ్బరి కార్మికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

'ప్రధాని ప్రతి ఇంటి గడప దాటారు'

సారథ్యయాత్రలో భాగంగా అమలాపురంలోని కాపు కల్యాణమండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన బీజేపీ సమావేశంలో ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రం అమలు చేస్తున్న జలజీవన్ పెన్షన్ పథకం, కల్యాణ యోజన ఇలా అనేక పథకాల ద్వారా గడప దాటిన వ్యక్తి మోదీ అని ప్రశంసించారు. ఈనెల 30న డీనోటిఫై ట్రైబ్ పేరుతో ప్రధాని విజయవాడలో బహిరంగసభ ఏర్పాటు చేశారని, సంచార జాతులు కాదు సదాచార్య వారసులు వారి అభ్యున్నతికి పీఎం మోదీ మాత్రమే ముగ్గురు సభ్యులతో కేంద్ర కమిటీని ఏర్పాటు చేసి వారికి అవసరమైన ఆధార్‌తోపాటు అన్ని ధ్రువీకరణ పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేశారని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతిఒక్కరినీ బీజేపీ అధిష్ఠానం గుర్తించి తగు ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. మరోఅతిథి ఎమ్మెల్సీ, మాజీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ప్రధాని మోదీ కంకణబద్ధులై పనిచేస్తున్నారని, మారుమూల ప్రాంతం నుంచి ఆయన చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. బహిరంగ సభకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్, యువమోర్చా రాష్ట్ర నాయకుడు సునీల్‌రెడ్డి, అయిలా సత్యనారాయణ, తమనంపూడి రామకృష్ణారెడ్డి, రామ్మోహనరావు, జిల్లాశాఖ మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు యిళ్ల సత్యనారాయణ, చీకురుమెల్లి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, కర్రి చిట్టిబాబు, మోకా వెంకటసుబ్బారావు, మాలే శ్రీనివాసనగేష్, అయ్యల బాషా పాల్గొన్నారు.

నగరంలో సారథ్య యాత్ర

బీజేపీ చేపట్టే సారథ్యం యాత్రలో భాగంగా అమలాపురంలోని గడియారస్తంభం సెంటర్‌కు బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేరుకున్నారు. ఆయనకు పార్టీ శ్రేణులు అఖండ స్వాగతం పలికాయి. గడియార స్తంభం సెంటర్ నుంచి భారీ ర్యాలీగా బీజేపీ నాయకులు, పార్టీశ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఓపెన్ టాప్‌జీప్‌లో బీజేపీ చీఫ్ మాధవ్‌తోపాటు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు అడాల సత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, నల్లా పవన్‌కుమార్ సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు ఎక్కారు. గడియారస్తంభం సెంటర్‌నుంచి ముమ్మిడివరం గేట్, వాసవి కల్యాణ మండపం మీదుగా కాపునాడు కల్యాణ మండపం మీదుగా సారథ్య యాత్ర సాగింది.

చాయ్‌పే చర్చలో మాధవ్

కోనసీమను అన్నివిధాలా అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయాల్లో ఒకటైన రైల్వేలైన్ అభివృద్ధి జరగడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బీజేపీ చీఫ్ మాధవ్ అన్నారు. అమలాపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం జరిగిన చాయ్ పే చర్చా కార్యక్రమంలో మాధవ్ పలు అంశాలపై మాట్లాడారు. కోనసీమను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు గోదావరి నదులు, సముద్రతీరం ప్రాంతం ఉన్న ఇక్కడ కొంకన్ రైల్వే తరహాలో ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలన్నారు. టెంపుల్ టూరిజంను డెవలప్ చేయాలన్నారు. దర్శనీయ క్షేత్రాలన్నింటినీ ఒక సర్క్యూట్‌గా ఏర్పాటు చేసి కోనసీమను ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంవల్ల ఆటో కార్మికుల జీవనోపాధికి ఇబ్బందికరంగా ఉందని వారి ఆవేదనను తన దృష్టికి తెచ్చారని, ఈసమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేసి ఆటోకార్మికులను ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. యాళ్ల దొరబాబు, నల్లా పవన్, మానేపల్లి అయ్యాజీవేమా, అడబాల సత్యనారాయణతోపాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో చాయ్‌పే చర్చలో మాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టించాలి

- జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం సృష్టించేందుకుగాను వివిధ రాష్ట్రాల మధ్య పోటీతత్వాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ సర్వే నిర్వహిస్తుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. సోమవారం ప్రజావేదిక కార్యక్రమంలో ఆమె అధికారులనుద్దేశించి మాట్లాడుతూ 2024, ఫిబ్రవరి 1 నుంచి 2025, ఫిబ్రవరి 15 మధ్య వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా సేవలందుకున్న యూనిట్లకు ఫోన్‌కాల్‌ద్వారా గానీ, వాట్సప్ మెసేజ్ ద్వారా కానీ వివరాలు సేకరించనున్నారన్నారు. ఈ విషయాన్ని వివరించేందుకుగాను 17 ప్రభుత్వ శాఖల అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి వివిధశాఖల సేవలందుకున్న వారు కూడా హాజరయ్యారన్నారు. సరైన పాజిటివ్ సమాధానం చెప్పి రాష్ట్రప్రభుత్వం మరింత మంచి ర్యాంకు పొందేందుకు తోడ్పాటునందించాల్సిందిగా ఆమె కోరారు. 2016 నుంచి 2021 వరకు ఏపీ ఈఓడీబీ ర్యాంకింగ్‌లో ప్రథమస్థానంలో ఉందని, 2022లో నిర్వహించిన సర్వేలో మొదటి ఐదు స్థానాల్లో ఉందని, మొదటి స్థానం నిలబెట్టుకునేందుకు కృషిచేయాలని కోరారు. కమిషనరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్‌నుంచి వచ్చిన అధికారి నరేంద్రకుమార్ ఈ సర్వే విధి విధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాపరిశ్రమ అధికారి అరుణ సహాయ సంచాలకులు శివరాంప్రసాద్, పరిశ్రమల ప్రోత్సాహక అధికారి మాధురి పాల్గొన్నారు.



మహా గణపతిం!

రేపటి నుంచి గణపతి నవరాత్రులు



21 పత్రాలు ఆరోగ్యమే

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడిని 21 రకాల పత్రాలతో పూజిస్తారు. అవన్నీ ఆరోగ్య ప్రదాయమే. ప్రధానంగా మాచీపత్రం, బృహతీపత్రం, బిల్వపత్రం, దూర్వాయియుగ్మం(గరిక), దత్తూర పత్రం, బదరీపత్రం, అపామార్గపత్రం, తులసీ, చూతపత్రం (మామిడి), కరవీరపత్రం, విష్ణుక్రాంత పత్రం, దాడిమి పత్రం, దేవదారుపత్రం, మరువకపత్రం, సిందువారపత్రం, జాజిపత్రం, గండకీపత్రం, శమీపత్రం, అశ్వత్థ పత్రం, అర్జునపత్రం, అర్కపత్రం(జిల్లేడు) ఉన్నాయని డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అందుబాటులో ఉండే ఈ పత్రాలు అన్నీ మానవ జాతికే కాదు సమస్త జీవరాశులకు ఎంతో మేలు చేకూరుస్తాయి. నవరాత్రుల అనంతరం ఆ పత్రాలను పంటకాల్వల్లో, నదుల్లో విడిచిపెట్టడం వల్ల ఆయా ప్రాంతాల్లోని చెడును దూరంచేసి శుద్ధమైన నీటిగా మార్చే శక్తి ఆ పత్రాలకు ఉన్నాయని తెలిపారు.



ఉత్సవ అనుమతులకు ఇలా చేయండి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

వినాయక చవితి ఉత్సవాల మండపాల ఏర్పాటు, ఊరేగింపుల నిర్వహణకు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతులకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వ్యక్తులు ముందుగా కమిటీగా ఏర్పడి సింగిల్‌విండో విధానంలో అనుమతులు తీసుకోవాలి. ముందుగా ప్రభుత్వం ప్రకటించిన https://ganeshutsav.ne వెబ్‌సైట్‌కు వెళ్లి న్యూ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి. మొబైల్ నెంబర్ ఎంటర్ చేసిన తర్వాత ఓటీపీ వచ్చి నెంబర్ వెరిఫికేషన్ జరుగుతుంది.ఆ తర్వాతే దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది.దీనిలో దరఖాస్తుదారుడి పేరు, మొబైల్ నెంబర్, ఈ మెయిల్, చిరునామా, కమిటీ పేరు, గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ పోలీస్ స్టేషన్ పరిధికి వస్తుంది, సబ్‌డివిజన్, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, గణేష్ నిమజ్జనం తేదీ, సమయం, విగ్రహం తరలించే వాహనం వివరాలు వీటిని ఎంటర్ చేసిన తర్వాత దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఇది జరిగిన తర్వాత సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది వచ్చి విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అనంతరం కమిటీ సభ్యులు https://ganeshutsav.net/application Status పై క్లిక్‌చేసి నో అబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ), పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. డౌన్‌లోడ్ చేసిన ఎన్‌వోసీ, క్యూఆర్ కోడ్ లామినేట్ చేయించి మండపంలో ఉంచాలి. అధికారులు తనిఖీ చేస్తారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదు. రోడ్డుపై పందిళ్లు వేయడం, ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం చేయకూడదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.అనుమతులకు ఒక పైసా చెల్లించనవసరం లేదు. ఉచితంగానే మంజూరు చేస్తారు.

రెడీగా.. గణేశుడు..



కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వినాయక చవితి ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి. ఎక్కడికి అక్కడ చలువ పందేళ్లు ఏర్పాటు చేశారు. భారీ విగ్రహాలు ముస్తాబు చేస్తున్నారు. చవితికి కేవలం రెండు రోజుల వ్యవధి ఉండడంతో విగ్రహాలను పందిళ్లకు తరలిస్తున్నారు. విగ్రహ సైజులను బట్టి రూ.3,500 నుంచి రూ.30 వేలు వరకు ధరలు ఉన్నాయి. మార్కెట్లోని దుకాణాల్లో అయితే బుల్లి బొజ్జ గణపతి విగ్రహాలు రూ.50 నుంచి రూ.3 వేలు వరకు విక్రయిస్తున్నారు. మూడు అడుగుల ఎత్తు నుంచి 11 అడుగుల ఎత్తు గల విగ్రహాలు మార్కెట్‌లో ఉన్నాయి. మూడు నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం గమనార్హం. ప్రతి ఏడాది లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. ఎందుకంటే వీధివీధినా గణపతులను ఏర్పాటు చేస్తారు. కొన్నిచోట్ల పందిళ్లను భారీ సెట్టింగ్‌లతో అదరగొట్టేస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు.



జాగ్రత్తలు నిబంధనలు..



- వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. విగ్రహాలు ఏర్పాటు చేసే సంబంధిత స్థల యజమాని, మునిసిపాలిటీ, కార్పొరేషన్లు, పంచాయితీ అధికారుల అనుమతులు తప్పనిసరి.
- అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి.నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలి.
- పందిళ్ల వద్ద అధిక వినిపించే సౌండ్ వినిపించే సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయకూడదు. విద్యాసంస్థల, ఆసుపత్రులు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైక్ ప్రచారం చేయకూడదు. అసభ్య ప్రదర్శనలు నిషేధం.
- రాత్రి వేళల్లో మండపాల వద్ద కాపలా ఉండాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిమజ్జనం పోలీసులు కేటాయించిన సమయంలో, మార్గంలోనే చేయాలి. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఊరే గించాలి. వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

పర్యావరణ హితేశా.. గణేశా!

అమలాపురం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే పండుగల పరమార్థం. అందునా తొలి పూజ అందుకునే గణపతి నవరాత్రులు పర్యావరణ హితాన్ని బోధిస్తున్నాయి. శుద్ధ చవితి నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలకు మట్టినే తన రూపంగా మార్చుకుని పర్యావరణ హితబోధ చేసేందుకు ప్రతి ఇంటికీ లంబోదరుడు తరలిరానున్నాడు. చేసే ప్రతిపూజా ప్రకృతిని కాపాడేలా ఉండాలి. జీవకోటి మనుగడకు ఎటువంటి అవరోధం లేకుండా ఉండాలి. కానీ కాలక్రమంలో వచ్చిన ఆధునిక మార్పులతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో గణపతి విగ్రహాలను తయారు చేయడం, వాటిని నదుల్లో, ప్రధాన పంటకాల్వల్లో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. ఎన్నో జీవరాశులకు ముప్పు వాటిల్లుతుంది. ఆలస్యంగానైనా యథార్థాన్ని గుర్తించారు. పూర్వపు మాదిరిగా మట్టి వినాయకుని ప్రతిమలను వినియోగిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు ఎందరో ముందుకు వచ్చారు. వారి కృషి ఫలించడంతో పాటు ఎక్కడికక్కడ వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు విరివిగా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నాయి. ప్రతి ఇంట తొలిపూజలు అందుకునే లంబోదరుడి ప్రతిరూపాన్ని ఇంటి ప్రాంగణంలోని పూలకుండీల్లో నిమజ్జనం చేయడం అలవాటు చేసుకున్నారు. వినాయకుని పూజకు వినియోగించే 21 రకాల పత్రులు కూడా జీవకోటికి ఎంతో మేలు చేకూర్చేవే. ఇలా ప్రకృతి పురుషునిగా గణపతి నిలుస్తున్నారు.

మట్టి గణపతిని ఇంటి ఆవరణలో నిమజ్జనం చేయండి



మట్టి విగ్రహంతోనే పూజ చేయాలి.. పూజముగిసిన అనంతరం ఆ మట్టి విగ్రహన్ని పొలంలో కానీ.. ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేసుకోవాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసే గణపతి విగ్రహాలు ప్రమాదకరం. ఆ విగ్రహాలను నవరాత్రుల అనంతరం నదుల్లో, కాల్వల్లో నిమజ్జనం చేయడం వల్ల ఎన్నో జీవజాతులు ఆ నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నాయి.

-డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు

మొక్క రూపంలో నిత్యం దర్శించుకుందాం



మట్టి వినాయక ప్రతిమల వెనుకభాగంలో ఏర్పాటు చేసిన రంధ్రంలో నచ్చిన మొక్కకు సంబంధించిన విత్తనాలను వేసి కుండీలో నిమజ్జనం చేయాలి. వేసిన విత్తు మొక్కగా మారి పూలు, పండ్లతో పాటు ఆరోగ్యవంతమైన గాలిని అందిస్తుంది. అంతటా విస్తరించి ఉన్న పరమాత్ముడు మొక్క రూపంలో నిత్యం దర్శనం ఇస్తూనే ఉంటాడు కదా.

-బళ్ల దివ్యతేజస్వి, భట్లపాలెం, బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల

డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విస్తృత ఏర్పాట్లు

- 28న పరిశీలన ప్రక్రియ
- 25 బృందాలు ఏర్పాటు
- డీఎస్సీ మెరిట్ అభ్యర్థులకు సమాచారం
- పరిశీలకుడిగా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం



చేబ్రోలులో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం, ఆర్జేడీ నాగమణి, కాకినాడ డీఈవో రమేష్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధించి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ నెల 28వ తేదీన జరగనున్న ఈ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా వారికి కావాల్సిన ల్యాప్‌టాప్‌లు, ఇతర సౌకర్యాలను సమకూర్చారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీఎస్సీ-2025 మెరిట్ జాబితాలో ఉండి సమాచారం ఇచ్చిన వివిధ కేటగిరీలకు చెందిన 1241 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ ఉదయం 7 గంటల నుంచి జరగనున్నది. ఇందుకోసం కళాశాలలో 30 గదులను సిద్ధం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్లతో కూడిన 25 తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. మరో ఐదు బృందాలను రిజర్వ్‌లో ఉంచారు. ప్రతి బృందం 50మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లతో వారు తీసుకువచ్చే ఒరిజనల్ సర్టిఫికెట్లలో కుల ధ్రువీకరణ పత్రాలను డిప్యూటీ తహసీల్దారు, మిగిలిన విద్యార్హతల సర్టిఫికెట్లను ఇతర టీమ్‌సభ్యులుపరిశీలిస్తారు.

ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఉమ్మడి జిల్లాకు పరిశీలకుడిగా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగాన్ని నియమించారు. ఆయనతో పాటు ఆర్జేడీ, ఉమ్మడి జిల్లా డీఈవోలు, డీవైఈవోలు, పరీక్షల ఏడీలు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం చేసిన ఏర్పాట్లను విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం, ఆర్జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సోమవారం పరిశీలించారు. అక్కడ సిద్ధం చేసిన 30 రూమ్‌లు, ఏర్పాటుచేసిన ల్యాప్‌టాప్‌లు, వైఫై, ఇతర సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈని, బందోబస్తు నిమిత్తం గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణకు సూచనలు ఇచ్చారు. వారి వెంట గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, మల్లాం జడ్పీ హైస్కూలు హెచ్ఎం గాజుల మురళీకృష్ణ వున్నారు.

మరోమారు...

డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చివరి క్షణంలో మరోమారు వాయిదా పడింది. తొలుత 25వ తేదీన నిర్వహిస్తామని ప్రకటించినా ఆదివారం రాత్రి ఈ ప్రక్రియను 26, 27 తేదీలకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయగా, వినాయకచవితిని దృష్టిలో ఉంచుకుని మళ్లీ వాయిదా వేయాలని రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకున్నారు. 28వ తేదీ ఉదయం 7 గంటల నుంచే వెరిఫికేషన్ ప్రారంభిస్తామని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని డీఈవో రమేష్ కోరారు.

ఎంపికైన కానిస్టేబుళ్ళకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్



కాకినాడ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు సోమవారం కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎంపికైన ఏపీఎస్పీ (మెన్), సివిల్ (మెన్ అండ్ ఉమెన్) మొత్తం 649 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు అన్నిటినీ పోలీసు అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఎస్పీ కార్యాలయ పరిపాలనాధికారి మూర్తి, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

తెలుగు భాషకు గుర్తింపు కోసం జాతీయ స్థాయిలో కృషి

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



తెలుగు భాషా సాహిత్య ఉత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు గుర్తింపు కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో వారం పాటు జరిగే డాక్టర్ పి.చిరంజీవినీకుమారి స్మారక తెలుగు భాషా సాహిత్య ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సానా సతీష్‌బాబు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం తెలుగు భాషా ఉత్సవాలు, భాషా సాహిత్య పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు భాషా స్ఫూర్తి నింపేందుకు సాహిత్య సృజనలో ఆసక్తి పెంచేందుకు చిరంజీవినీకుమారి భాషా సాహిత్య ఉత్సవ వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. విద్యాలయాల్లో తెలుగు భాషను సజీవంగా నిలిపేందుకు పార్లమెంట్ వేదికగా కృషి చేస్తానన్నారు.

గౌరవ అతిథి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ తెలుగు భాషా ఉత్సవాల నిర్వహణ అభినందనీయమన్నారు. ఎంపీ సానా సతీష్‌బాబును ఐడియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, డాక్టర్ ఎన్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మెర్ల రంజిత్ సత్కరించారు. కథానిక రచన పోటీల్లో సుమారు 50 పాఠశాలలు, 11 కళాశాలల నుంచి 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 40 మంది తెలుగు ఉపాధ్యాయులను అతిథులు సత్కరించారు. అవధాని జి.వేంకట సత్య నరసింహ శాస్త్రి తెలుగు ఉపాధ్యాయులనుద్దేశించి ప్రసంగించారు. 26, 28 తేదీల్లో పోటీలు జరుగుతాయని, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న జరిపే తెలుగు భాషా దినోత్సవం సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి వర్మ, కృష్ణంరాజు, శ్రీకాంత్, చింతపల్లి సుబ్బారావు, రచయితలు రవిమంత్రి, మాకినీడి, కేఎస్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ వి.కామరాజు, పీఆర్వో బీఎస్ఆర్ కృష్ణ, శ్రీనివాస్, కవులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీపాదశ్రీవల్లభులకు లక్ష బిల్వార్చన

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో సోమవారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో ఐదో రోజు ప్రత్యేక పూజలు, శ్రీపాదుని దివ్య పాదుకలకు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, గోపూజ, పల్లకీ సేవ జరిగాయి. రుత్విక్కులు, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య బిల్వార్చన సాగింది. అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను విశేషంగా అలంకరించారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్విక్కులు



లక్ష బిల్వార్చన అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. పెళ్లి కోసం నేరం..

- ఇద్దరు పురుషులు ఇష్టపడి.. ఒకరు హిజ్రాగా మారాలని మరొకరి షరతు
- ఆపరేషన్ కోసం దొంగతనానికి ప్లాన్
- వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి బంగారు గొలుసు, గాజులతో పరారీ
- ఇద్దరిని అరెస్టు చేసిన తుని పోలీసులు


తునిలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ప్రియుడితో పెళ్లి కోసం హిజ్రాగా మారాలనుకున్నాడో వ్యక్తి. అయితే ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చువుతుండడంతో దొంగతనానికి ప్లాన్ చేశాడు. పక్క ఇంటిని టార్గెట్ చేసుకున్నాడు. ఆ ఇంట్లో వృద్ధురాలిపై ప్రియుడితో కలిసి దాడి చేసి బంగారం లాక్కుని పరారై చివరికి పోలీసులకు చిక్కారు.

తునిరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ పోలీస్‌స్టేషన్లో సోమవారం పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఈ కేసు వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన సతీష్ అలియాస్ అవంతి కరెడ్డి 3 సంవత్సరాల క్రితం తుని వచ్చి స్థానిక హిజ్రాలతో కలిసి జీవిస్తున్నాడు. ఆడ లక్షణాలు ఉడడంతో రాత్రి వేళల్లో మహిళ వేషధారణలో జాతీయ రహదారిపై ఉంటూ పలువురిని ఆకరిస్తూ డబ్బులు సంపాదించేవాడు. అలాగే పండుగలు, జాతరలో డ్యాన్సులు వేస్తూ జీవనపాధి పొందేవాడు. అవంతికరెడ్డికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రశాంత్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో వారిద్దరూ తుని పదో వార్డులో నిమ్మకాయల వారి వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని భార్యాభర్తల్లా కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో అవంతిక రెడ్డి తనను పెళ్లి చేసుకోమని ప్రశాంత్‌ను కోరగా ఆపరేషన్ చేయించుకుని పూర్తిగా హిజ్రాగా మారితే తాను పెళ్లి చేసుకుంటానని ప్రశాంత్ చెప్పాడు. దీంతో ఆపరేషన్‌కు అవసరమయ్యే రూ.5 లక్షల కోసం అవంతిక రెడ్డి, ప్రశాంత్ దొంగతనానికి ప్లాన్ వేశారు. వారి ఇంటి పక్కనే ఉన్న వృద్ధురాలు బాలేపల్లి సత్యవతిపై దాడి చేసి బంగారం చోరీ చేయాలని నిశ్చయించుకున్నారు. ఈనెల 20న అర్ధరాత్రి దాటిన తర్వాత సత్యవతి ఇంటి వెనుక భాగంలో బాత్రూం వద్దకు రాగా అప్పటికే వేచి ఉన్న అవంతికరెడ్డి, ప్రశాంత్ ఆమె కళ్లల్లో కారం కొట్టారు. చేతులతో నోటిని మూసి మెడలో ఉన్న పగడాల బంగారు గొలుసుతో పాటు చేతికి ఉన్న 4 బంగారు గాజులను లాక్కుని పరారయ్యారు. దీంతో సత్యవతి తుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తుని సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో పలు కోణాల్లో దర్యాప్తు నిర్వహించిన పోలీసులు సత్యవతి ఇచ్చిన సమాచారం, ఇతర కోణాల్లో దర్యాప్తు ఆధారంగా దోపిడీ చేసింది అవంతికరెడ్డి, ప్రశాంత్ అని నిర్ధారించుకుని ఈనెల 24న కొండవారి పేటకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గెస్ట్ హౌస్ వద్ద వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 గ్రాముల పగడాల బంగారు గొలుసు, సుమారు నాలుగున్నర తూలల బంగారు గాజులు, 2 సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.7 లక్షలు ఉంటుందని డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన తుని సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐలు విజయ్, పాపారావు, సిబ్బంది యాదవ్, నాయుడు, శివయ్యను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు.

7న సత్యదేవుడి ఆలయం మూసివేత

ఈవో సుబ్బారావు

అన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 7న చంద్రగ్రహణం సందర్భంగా అన్నవరంలో సత్యదేవుడి ఆలయం మూసివేయనున్నట్టు ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 10గంటల వరకు వ్రతం టిక్కెట్లు విక్రయించి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సర్వదర్శనములు నిలుపుదల చేసి తలుపులు మూసివేయడం జరుగుతుందన్నారు. తిరిగి 8వతేదీన సంప్రోక్షణ చేసి ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనాలు వ్రతాలు ప్రారంభమవుతాయని భక్తులు గమనించాలని కోరారు. 7వ తేదీ చంద్రగ్రహణం రాత్రి 9.50కి ప్రారంభమై 1:31 వరకు ఉంటుందని దేవస్థానం పండితులు తెలిపారు.

ఇద్దరి మధ్య ఘర్షణ... విడదీసేందుకు వెళ్లిన వ్యక్తిపై చాకుతో దాడి

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు గొడవ పడుతుండగా మధ్యలో విడదీసేందుకు వెళ్లిన వ్యక్తిపై చాకుతో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో జరిగింది. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద గ్రామానికి చెందిన నీలం లక్ష్మీ ప్రసాద్ గణపతి మండపం డెకరేషన్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం చెంతన గోళ్ల సాయి గణేష్, అగత్తి సాయి మధ్య ఘర్షణ ఏర్పడింది. గమనించిన లక్ష్మీ ప్రసాద్ ఇద్దరినీ విడదీసి సర్దిచెప్తున్న క్రమంలో గోళ్ల సాయి గణేష్ తన వెంట తెచ్చుకున్న చాకుతో గొంతు ఎడమ భాగంలో కోయడంతో రక్తపు గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ప్రియకుమార్ కేసునమోదు చేశారు.

మహిళపై కర్రలతో దాడి

నలుగురిపై కేసు నమోదు చేసిన పిఠాపురం రూరల్ పోలీసులు

పిఠాపురం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేసుకుంటున్న దళిత మహిళపై కర్రలతో దాడి చేసి స్పృహ తప్పేలా కొట్టడంతో పాటు కులంపేరుతో దూషించిన నలుగురు వ్యక్తులపై పిఠాపురం రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం పందిగరువు గ్రామానికి చెందిన కొత్తిపేల మేరీ పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో 20 సెంట్లు పొలంలో సాగు చేసుకుంటుండగా తనపై కే.శివ, రాంబాబు తదితరులు దాడి చేసి కొట్టి గాయపరిచినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ జానీబాషా తెలిపారు. ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

అమలాపురం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడిచేసిన కేసులో పులిదిండి వెంకట్రావుకు కోర్టు 14రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు లంకతోటకు చెందిన జల్లి మంగాదేవిపై అదే ప్రాంతానికి చెందిన పులిదిండి వెంకట్రావు ఈ నెల 21న దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనలో మంగాదేవి నాలుగు పళ్లు ఊడిపోయాయి. ఎస్ఐ మనోహర్ జోషి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దుస్తులు ఆరవేసుకునే విషయంలో జరిగిన ఘటనపై వెంకట్రావును అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండు విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

సత్యదేవుడి సన్నిధికి రూ.5 లక్షల విలువైన 2 ఫ్యాన్లు

ముందుకొచ్చిన దాత

అన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు వార్షిక కల్యాణమండపం వద్ద సేదతీరేందుకు రూ.5 లక్షల విలువైన 2 హెలికాప్టర్ ఫ్యాన్లను దేవస్థానానికి ఉచితంగా అందించేందుకు లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే సత్యప్రసాద్ ముందుకొచ్చారు. సోమవారం సత్యదేవుడిని దర్శించిన ఆయన ఈ విషయంపై చర్చించి అంగీకరించారు. రెండురోజుల్లో ఈ ఫ్యాన్లను అమర్చనున్నట్టు దాత తెలిపారు.


ఫ్యాన్ల ఏర్పాటుపై ఈవోతో చర్చిస్తున్న దాత మట్టే సత్యప్రసాద్

ఏటీఎంలో చోరీకి యత్నం... ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్


నిడదవోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిడదవోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నించిన అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేయడం ద్వారా 7 కేసులు ఛేదించినట్టు సీఐ పీవీజీ తిలక్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నం జరిగింది. నిడదవోలుకు చెందిన కోలా అభిషేక్, కోనసీమ జిల్లాకు చెందిన గుద్దటి రాజు ఈ చోరీకి ప్రయత్నించగా వారిని అరెస్ట్ చేశారు. పెందుర్తిలో 2, పాడేరులో 1, వి. మాడుగలలో 1, మండపేట రూరల్‌లో 1, రాజా నగరంలో 1, సమిశ్రగూడెంలో 1 మొత్తం 7 నేరా లు ఈ ఇద్దరు కలిసి చేసినట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని సీఐ తెలిపారు. నిందితులపై సుమారు 30 పాత కేసులు ఉన్నాయని, చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు బాలాజీ సుందరరావు, జగన్ మోహనరావు పాల్గొన్నారు.

నిందితులపై 30 పాత కేసులు

సీఐ తిలక్

తెలుగు సాహిత్యంపై అక్టోబరు 7న జాతీయ సదస్సు

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహణ

'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ


జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుసాహిత్యం -భాషాబోధన మనోవికాసం అనే అంశంపై అక్టోబరు 7న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని వై.ఎస్.కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. వై.ఎస్.కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు డైరెక్టర్ పిట్టా శాంతి సోమవారం తూర్పుగోదావరి జిల్లాలోని నన్నయ విశ్వవిద్యాలయానికి వచ్చి వీసీని కలిశారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సు వివరాలు తెలిపారు. అనంతరం వీసీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రాచీన సాహిత్యం, ప్రబంధసాహిత్యం, దక్షిణాంధ్రయుగ సాహిత్యం, శతకసాహిత్యం, ఆధునిక సాహిత్య ప్రక్రియలు, జానపద గిరిజన విజ్ఞానం, ప్రాథమిక, ఉన్నత విద్య, మాతృభాషాబోధన, వివిధ బోధనా పద్ధతులు వంటి బోధన మనోవికాసం ఉప అంశాలపై పరిశోధకులు పరిశోధనాపత్రాలను వైఎస్‌బిఇడిసెమినార్2025 జి.మెయిల్ డాట్ కామ్ అనే మెయిల్‌కు సెప్టెంబరు25లోగా పంపించాలని కోరారు. తెలుగుభాష, సాహిత్య ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహకులు పి.శాంతి, ముత్యాలకళ్యాణ రామకృష్ణారావు, సీహెచ్.రుద్రమదేవి, జి.రాధ, సీహెచ్.వరలక్ష్మి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రేవ్ పార్టీ.. కోనసీమ వాసుల అరెస్ట్!

అమలాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన రేవ్ పార్టీపై గచ్చిబౌలి పోలీసులు, ఈగల్ టీమ్ దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. అయితే అరెస్ట్ అయిన వారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ఇద్దరు యువకులు ఉన్నట్టు సమాచారం. వారిలో రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన తేజారెడ్డి, ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన విక్రమ్‌రెడ్డి ఉన్నట్టు భావిస్తున్నారు. వారు హైదరాబాద్‌లో నివాసముంటున్నట్టు తెలుస్తుంది. గతేడాది డ్రగ్స్ కేసులో విక్రమ్‌రెడ్డి ఉన్నారు. అయితే కొత్తపేట సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. హైదరాబాద్ డ్రగ్స్ లింక్‌లపై జోరుగా ఆ ప్రాంతంలో జోరుగా చర్చ జరుగుతుంది.

రెవెన్యూ అధికారి పేరు కూడా...

రాజమహేంద్రవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రేవ్ పార్టీ కేసులో రాజమండ్రికి చెందిన రెవెన్యూ అధికారి మణిదీప్ పేరు ఉన్నట్టు ప్రచారం జరిగింది. అయితే దీనిపై ఆయన మాట్లాడుతూ నేను అసలు ఇటీవల హైదరాబాద్ వెళ్లలేదని, ఇక్కడే ఉన్నానని చెప్పారు. అయితే ఈ కేసుపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్‌ను ఆరాతీయగా తాము హైదరాబాద్ నుంచి సమాచారం కోరామని, రికార్డులన్నీ పరిశీలించి ఒక స్పష్టత తెస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ మహిళల జట్టు ఎంపిక

ఐ.పోలవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్స్ మహిళల జట్టును ఈనెల 27న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జి.వేమవరం జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అడ్డగళ్ళ నాగరాం ప్రసాద్ తెలిపారు. ఈ నెల 30 నుంచి 31 వరకు పల్నాడు జిల్లా దూళిపాళ్ళలో జరిగే స్టేట్ సాఫ్ట్‌బాల్ మీట్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, అసోసియేషన్ ఐడీ కార్డు, జనన ధృవపత్రం తీసుకురావాలని ఆయన తెలిపారు.

లక్కవరంలో వ్యక్తి దారుణ హత్య

మంత్రగాడనే అనుమానంతో తల, మొండెం వేరు చేసిన వైనం

మోతుగూడెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు పోలీస్ సర్కిల్ మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల లక్కవరం గ్రామంలో నివసిస్తున్న మూట రామయ్య (45) అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం సాయంత్రం దారుణంగా హత్య చేశారు. రామయ్య మంత్రగాడనే నెపంతో చంపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల, మొండెంను వేరు చేసి తలను దగ్గం చేసినట్టు తెలిసింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చింతూరు సీఐ గోపాలకృష్ణ మోతుగూడెం ఎస్ఐ సాదిక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు తెలిపారు.


మూట రామయ్య మృతదేహం

పామాయిల్ తోట ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమ పొలంలోకి అక్రమంగా చొరబడి 10 ఎకరాల విస్తీర్ణంలోని పామాయిల్ తోటను నరికేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు గ్రామానికి చెందిన మంక మల్లిఖార్జునస్వామి అలియాస్ మల్లిబాబు సోమ వారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్లిబాబు మాట్లాడుతూ కానవరం గ్రామానికి చెందిన సంగిశెట్టి వీరవెంకట్రావు అతడి అనుచరులు సోమవారం రాత్రి చొరబడి సర్వే నంబరు 298/6; 298/7; 298/8 నంబర్లలో 4.86 ఎకరాలు, ఎల్పీ నెంబరు 3159,306,3298, 3300,3585 సర్వే నంబర్లలో 5.25 ఎకరాల పొలంలో పామాయిల్ మొక్కలను రాత్రికి రాత్రి నరికేశారన్నారు. పంట నాశనం చేయడంతో పాటు బోరు మోటారు దొంగిలించి, పొలంలో పనిచేస్తున్న వ్యక్తులను తీవ్రంగా హింసించడమే కాకుండా తనను కూడా చంపుతానని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు.


ధ్వంసమైన పామాయిల్ తోట

డీఎస్సీ ఫలితాల్లో 'శ్యామ్' ప్రతిభ

శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ఫలితాల్లో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణపొందిన విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు డైరెక్టర్ జి.శ్యామ్ తెలిపారు. డీఎస్సీ శిక్షణ ప్రారంభించిన మొదటి ప్రయత్నంలోనే వివిధ విభాగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు, జిల్లా ఫస్ట్ ర్యాంకులతో సంచలన విజయాలను సాధించారని వివరించారు. విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా శ్యామ్ అభినందించారు. ఆరు స్టేట్ ర్యాంకులతో పాటు స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా టాప్ ర్యాంకుల్లో పదిమంది అభ్యర్థులు విజయం సాధించారని శ్యామ్ పేర్కొన్నారు. ఎస్‌జీటీ విభాగంలో జిల్లా టాప్ ర్యాంకులు సాధించిన తొమ్మిది మంది అభ్యర్థుల వివరాలను కూడా శ్యామ్ వివరించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన వారిలో బి.హరీష్, బి.దిలేష్, వి.రమ్యశ్రీ, డి.బాలు నాయక్, ఎం.డేనియల్ కుమార్, సీహెచ్ భవాని ఉన్నారన్నారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్యామ్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

13న జాతీయ లోక్ అదాలత్

ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి : పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి కృషి చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ని వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆ జిల్లాల ఈఎస్‌లు, ఏఈఎస్‌లు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో మేల్‌నర్సు సస్పెన్షన్


నిందితుడు సందీప్ (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళపై అకృత్యాలకు పాల్పడిన కాకినాడ జీజీహెచ్ మేల్‌నర్సు సస్పెన్షన్‌కు గురయ్యాడు. బాధితురాలు ఆదివారం కాకినాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదయ్యింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా, పత్రికల్లో వచ్చిన ఆధార సహిత వార్తల ఆధారంగా నర్సు మోకా సందీప్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు అధికారులు సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోజంతా మద్యం మత్తులో ఉండడం, విధులకు కూడా మద్యం తాగి రావడం, నర్సు అయి ఉండి బాధితురాలి నగ్న ఫొటోలు ఆమెకు తెలియకుండా తీసి బ్లాక్‌మెయిల్ చేయడం, ఆమెపై దాడి చేసి అఘాయిత్యానికి పాల్పడడం, ఆమె ఫొటోలను కన్న కొడుకుకు పంపి పైశాచిక ఆనందం పొందడం, ఆ మైనర్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించడం అంశాల ను ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చిన నేపథ్యంలో ఇవే అంశాల ప్రాతిపదికన సందీప్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. సందీప్‌పై విధించిన సస్పెన్షన్ సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. సందీప్ మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడని అతడితో పాటు పని చేస్తున్న మరికొంత మంది మేల్ నర్సులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆ దిశగా దృష్టిసారించారు. ఇది ఇలా ఉంటే నిందితుడు సందీప్ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భర్త కళ్లెదుటే భార్య మృతి

మితిమీరిన వేగంతో వచ్చిన లారీ ఢీకొని ప్రమాదం

కాకినాడ వలసపాకల గంగరాజునగర్‌లో ఘటన

సర్పవరం జంక్షన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో వచ్చిన లారీ మోటార్ సైకిల్‌ని వెనుక నుంచి ఢీకొనడంతో లారీ చక్రం కింద పడి వివాహిత దుర్మరణం పాలైన సంఘటన సోమవారం కాకినాడ వలసపాకల గంగరాజునగర్ మెయిన్‌రోడ్‌లో జరిగింది. వివరాల్లోకెళితే కాకినాడ డెయిరీఫారమ్ సెంటర్‌కు చెందిన అరికిరెడ్డి సత్యనారాయణ, వెంకటరమణ (51) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు. సత్యనారాయణ తాపీపని చేస్తుంటాడు. అనారోగ్యంతో పనిలోకి వెళ్లడం లేదు. ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాలని భార్య కోరడంతో సోమవారం ఉదయం డెయిరీఫారమ్ సెంటర్ నుంచి టీవీఎస్-50 మోటార్‌సైకిల్‌పై తోడుగా భార్యను ఎక్కించుకుని వాకలపూడిలో గల కోరమండల్ ఆసుపత్రికి వెళుతున్నారు. మార్గం మధ్యలో వలసపాకల మెయిన్‌రోడ్డు గంగరాజు నగర్ సూర్యకార్ వాష్ వద్దకు వచ్చేసరికి వెనకాల నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన లారీ మోటార్ సైకిల్‌ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరత్నం పై నుంచి లారీ చక్రాలు తొక్కుకుంటూ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోడ్డు ప్రమాదంలో కళ్లెదుటే భార్య మృతిచెందడంతో భర్త సత్యనారాయణ కన్నీరుమున్నీరుగా విలపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు సర్పవరం ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తాటి బెల్లం వ్యాపారి అనుమానాస్పద మృతి

కరప, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన తాటి బెల్లం వ్యాపారి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తుతుక్కుడి జిల్లా అయ్యనరుతు మండల కేంద్రానికి చెందిన వెలువెత్తు మురుముత్తు (30), ముత్తు, అల్విన్, ముత్తయ్య పెరుమాళ్లు బొలేరో వ్యాన్‌లో పలు రాష్ట్రాల్లో తాటి బెల్లం అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా పదిరోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చిన వారు ఈనెల 24న కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులో తాటి బెల్లం విక్రయించారు. రాత్రికి స్థానిక భారత్ పెట్రోల్ బంక్ వద్ద బొలేరో వాహనాన్ని నిలిపి అందులోనే మద్యం సేవించి, భోజనం చేసి నిద్రపోయారు. సోమవారం ఉదయం పెరుమాళ్ ముత్తయ్య టీ పట్టుకుని వచ్చి వెలువెత్తు మురుముత్తును ఎంతలేపినా నిద్రలేవలేదు. దీంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. పెరుమాళ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

కోడిపందాలు ఆడుతున్న 13 మంది అరెస్ట్

రూ.35 వేల నగదు, 3 కోళ్లు, 16 కార్ల స్వాధీనం

నల్లజర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల బైపాస్ పక్కనే కోడిపందాలు నిర్వహిస్తున్న బృందంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో సీఐ బాలచౌరి సిబ్బందితో దాడి చేసి 13 మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.35 వేల నగదు, 3కోళ్లు,16 కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేస్తున్నారనే సమాచారం పందెం రాయుళ్లకు చేరడంతో అనేకమంది పారిపోయారు. కార్లలో వచ్చిన వారు తప్పించుకునే మార్గం లేకపోవడంతో పోలీసులకు చిక్కారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

రామ్‌మాధవ్ సభకు తరలిన నాయకులు

మామిడికుదురు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):అమలాపురంలో జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌మాధవ్ సభకు మామిడికుదురు నుంచి పార్టీ శ్రేణులు జెండాలు ప్రదర్శిస్తూ మోటారుసైకిల్‌పై ర్యాలీగా వెళ్లారు. భైరిశెట్టి దుర్గారామకృష్ణ, మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, కంకిపాటి సుబ్బారావు, నక్కా త్రిలోచనరావు ఉన్నారు.

మట్టి వినాయకుని ప్రతిమల వితరణ

ముమ్మిడివరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) అనాతవరంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. సేవా ఫౌండేషన్ మండల సహాయ కన్వీనర్ నల్లా ఆండాళ్‌దేవి, బీజేపీ నాయకులు గొలకోటి వెంకటరెడ్డి, గ్రంధి నానాజీ, ముమ్మిడివరం సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ బొంతు కనకారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతుల వెల్లువ

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు అందించిన ప్రజలు




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ జిల్లాశాఖ నాయకులు, కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

అమలాపురంటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, డీఎల్డీవోలు రాజేశ్వరరావు, త్రినాథరావు అర్జీలను స్వీకరించారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి : కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ ధర్నా

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు బూసి జాన్‌మోషే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో సమగ్ర కుల జనగణన చేసి బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు. 2014ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ధర్నాలో జిల్లా ఇన్‌చార్జి వాకపల్లి భీమారావు, ఉపాధ్యక్షుడు జిత్తుక సత్యనారాయణ, కార్యదర్శి కోనాల ప్రకాష్, కోశాధికారి కాంద్రేగుల గంగరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, పెండెం శ్రీనివాసరావు, జేఎస్వీ రాజు, ఆకుమర్తి భూషణం పాల్గొన్నారు.

శెట్టిబలిజలుగానే కులధ్రువీకరణ ఇవ్వాలి
శెట్టిబలిజ సంఘ నాయకులు

కులధ్రువీకరణ పత్రంలో శెట్టిబలిజలుగానే పేర్కొనాలని డిమాండ్ చేస్తూ కోనసీమ శెట్టిబలిజ మహానాడు అధ్యక్షుడు మట్టపర్తి మీరాసాహెబ్‌శెట్టి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ధ్రువీకరణ పత్రాల్లో శెట్టిబలిజ పేరును గౌడ కులంగా మార్చడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. తక్షణం ఆ జీవోను రద్దు చేయడంతో పాటు వెబ్‌సైట్ నుంచి తొలగించి యథావిధిగా శెట్టిబలిజ కులస్తులుగానే పరిగణిస్తూ జీవో విడుదల చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. నిరసనలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సంసాని బులినాని, చెల్లుబోయిన శ్రీనివాస్, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి బాబు, రెడ్డి సత్యనాగేంద్రమణి, గుబ్బల శ్రీను, కాంద్రేగుల రాము, గుత్తుల శ్రీను, గుత్తుల చిరంజీవి, గుత్తుల సత్తిబాబు, గొవ్వాల రాజేష్, దంగేటి రుద్ర, వాసర్ల వెంకన్నతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సంఘీయులు పాల్గొని కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

దివ్యాంగ పెన్షన్లు పునరుద్ధరించాలి:
వైసీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, విశ్వరూప్ నిరసన

రాష్ట్రంలో తొలగించిన దివ్యాంగుల పెన్షన్లను తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. దివ్యాంగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. లక్ష మందికి పైగా దివ్యాంగుల పెన్షన్లను తొలగించడాన్ని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తప్పుపట్టారు. దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం వల్ల వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. వెరిఫికేషన్ల పేరిట దివ్యాంగులను చిత్రహింసలకు గురి చేయడం మానుకోవాలని నినాదాలు చేశారు. కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కాశి బాలమునికుమారి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, కుడుపూడి భరత్‌భూషణ్, చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి కల్పించాలి:
మట్టి పాత్రలతో శాలివాహన సంక్షేమ సంఘ ప్రతినిధులు

మట్టితోనే జీవనోపాధిని పొందుతున్న కుమ్మర శాలివాహనులను ఆదుకోవాలని సంక్షేమ సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం ఆధ్వర్యంలో మట్టి పాత్రలతో నిరసన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుమ్మర శాలివాహనుల జీవనోపాధికి విడుదలచేసిన ఉత్తర్వులను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి ఎటువంటి అవరోధాలు, ఆంక్షలు లేకుండా మట్టిని తీసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. వినాయకచవితికి మట్టి ప్రతిమలు, దీపావళికి ప్రమిదలు, దసరాకు అమ్మవారి విగ్రహాలు ఇలా ఎన్నో చేసుకుంటూ మట్టి పాత్రలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్న తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ అర్జీ అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు వెల్ల త్రిమూర్తులు, సలహాదారు దొడ్డిపట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచానికే పరిమితమైనా పెన్షన్ తొలగించారు
- ముత్యాల మణికంఠజ్యోతి, గోపాలపురం

పుట్టుకతోనే మంచానికి పరిమితమయ్యాను. 15ఏళ్లుగా దివ్యాంగ పెన్షన్ తీసుకుంటున్నా. కనీసం లేచి కూర్చొనే పరిస్థితి కూడా లేదు. నూరుశాతం దివ్యాంగురాలిని. ఇటీవల పెన్షన్‌ను రూ.15వేలకు పెంచితే ఎంతో ఆనందపడ్డా. ఇప్పుడు ఏకారణం చూపకుండా పెన్షన్ తొలగించారు. తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, సుబ్రహ్మణ్యంలపై ఆధారపడి జీవించే పరిస్థితి కల్పించారు. పెన్షన్‌ను పునరుద్ధరించి ఆదుకోవాలి.

సమస్యల వలయంలో జగనన్న కాలనీ

● రోడ్లు, డ్రైనేజీ, వసతులు లేక ఇక్కట్లు
● గుత్తెనదీవి కాలనీలో సౌకర్యాలు నిల్



గుత్తెనదీవి జగనన్న కాలనీలో రోడ్లు లేని దుస్థితి

ఐ.పోలవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నివాసిత ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యాలు ఉండాలి. జగనన్న కాలనీలో ప్రజలకు అవసరమయ్యే రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. కనీస సౌకర్యాలు కల్పించలేదు. కొన్ని చోట్ల పట్టాలు పంపిణీ చేశారు గాని స్థలాలు చూపించలేదు. మండలంలో పాతయింజరం, గుత్తెనదీవి, మురమళ్ళ, టి.కొత్తపల్లి గ్రామాల్లో గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. వాటిలో కొన్ని చోట్ల కనీస సౌకర్యాలు కల్పించలేదు. గుత్తెనదీవి జగనన్న కాలనీలో లబ్ధిదారులు ముందుకొచ్చి పక్కా భవనాలు నిర్మించుకున్నారు. అయితే కాలనీలో రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చాలు చిత్తడిగా మారే రోడ్లపై అక్కడివారు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. డ్రైనేజీ సౌకర్యం లేక ముంపునీరు దిగే మార్గం లేక రోడ్లపై నీరు నిల్వ ఉండి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కాలనీలో ప్రధాన రోడ్డుతో పాటు ఇంటర్నల్ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొద్దిపాటి వర్షానికి మహిళలు, పిల్లలు, వృద్ధులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంత మందికి వారి గ్రామాల్లో కాకుండా వేరే గ్రామాల్లో స్థలాలు కేటాయిచడంతో ఆ స్థలాలు ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. కూటమి పాలకులు సైతం కాలనీల్లో సౌకర్యాలు కల్పించడం లేదంటూ లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పట్టా భూముల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఎగ్ వినియోగం ప్రోత్సహించేందుకు ఎగ్ కార్ట్‌లు



డ్వాక్రా మహిళకు ఎగ్ కార్ట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎగ్ వినియోగాన్ని ప్రోత్సహించి తద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు లక్ష్యంగా నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఎగ్ కార్ట్‌లను అందిస్తుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించిన మొదటి విడతగా అయినాపురానికి చెందిన డ్వాక్రా మహిళ దొమ్మేటి రామలక్ష్మికి మంజూరైన ఎగ్ కార్ట్‌ను సోమవారం ఎమ్మెల్యే అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడ్డు ఉత్పత్తిదారులకు న్యాయమైన లాభదాయకమైన ధరలను నిర్ధారించడం, వినియోగదారులకు సరసమైన ధరలకు అందించడం, కోళ్ల పరిశ్రమ సమగ్ర అభివృద్ధికి, రైతులు, వినియోగదారులు ఇద్దరికి హాని కలిగించే ధరల హెచ్చుతగ్గులను నివారించేందుకు సెర్ప్ సంస్థ సహకారంతో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ రూ.50వేలు విలువైన ఎగ్ కార్ట్‌ను పూర్తి రాయితీతో అందిస్తుందన్నారు. నాయకులు గత్తుల సాయి, గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, దాట్ల పృథ్వీరాజ్, చిక్కాల అంజిబాబు, బొంతు నాగరాజు, సబ్బతి డేవిడ్ రాజు, బొక్కా ధర్మారావు, సానబోయిన శ్రీనివాస్, పచ్చమట్ల కృష్ణంరాజు, ఏఎంపీ రమణి, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు కొనసాగించాలి



అమలాపురంటౌన్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగుల పెన్షన్లను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అమలాపురం నల్లవంతెన వద్ద ధర్నాచౌక్‌లో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. బోగస్ పెన్షన్లు తొలగించి అర్హులైన వారికి పెన్షన్లను కొనసాగించాలని నినాదాలు చేశారు. శిబిరాన్ని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, నాయకులు గుదే దుర్గాప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు.

నిబంధనలు విధిగా పాటించాలి

ముమ్మిడివరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలకు పోలీసు శాఖ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. ముమ్మిడివరంలో సోమవారం ఆయన వినాయకచవితి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వాహకులు, ఉత్సవాల నిర్వాహకులు విధి విధానాలను తప్పక పాటించాలని ఎస్ఐ డి.జ్వాలా సాగర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చి గాలికొదిలేస్తున్నారు?



ధర్నాచౌక్‌లో పెన్షనర్ల సమస్యలపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బూటకపు హామీలతో రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి పెన్షనర్లను ఒక సాధనంగా వాడుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) విమర్శించారు. ఎన్నికలకు ముందు నాయకులు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్‌దారుల సమస్యలను మాత్రం గాలికొదిలేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్ పెన్షనర్ల సంఘాల సంయుక్త కమిటీ పిలుపుమేరకు సోమవారం అమలాపురంలోని నల్లవంతెన వద్ద ధర్నాచౌక్‌లో పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు అధికారమే పరమావధిగా భావిస్తూ పెన్షనర్ల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పెన్షనర్ల సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు కడలి సత్యనారాయణ, కార్యదర్శి గుబ్బల గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈపీఎస్-95 పెన్షనర్లకు డీఏతో కలిపి రూ.9వేలు కనీస పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.20వేల కోట్లు తక్షణం చెల్లించాలన్నారు. పెండింగ్ డీఏలు విడుదల చేయడంతో పాటు 12వ పీఆర్సీని నియమించి మధ్యంతర భృతి చెల్లించాలని నినాదాలు చేశారు. ధర్నాలో జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు డి.శ్రీరామమూర్తి, కోశాధికారి పి.భాస్కరరావు, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, పితాని రామకృష్ణ, వి.భానోజీరావు, సీహెచ్ దుర్గాప్రసాద్, కేవీ రమణ, మట్టపర్తి రాంబాబు పాల్గొన్నారు.

మాధవ్‌కు జీడిపప్పు మాలతో సత్కారం



మలికిపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో సోమవారం జరిగిన బీజేపీ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు సమక్షంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను చింతలమోరి సొసైటీ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు దొడ్డా నాగబాబు జీడిపప్పుతో చేసిన మాలతో సత్కరించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటశాస్త్రికి సువర్ణహస్త కంకణం బహూకరణ



అంతర్వేది, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్ల యజుర్వేద పండితులు చింతా వెంకటశాస్త్రి దంపతులను నర్సాపురం పట్టణ పురోహితులు, అంగర సత్యనారాయణ సోదరుడు సువర్ణ హస్త కంకణంతో ఘనంగా సత్కరించారు.

డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

ముమ్మిడివరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లాశాఖ సమావేశం డిమాండ్ చేసింది. ముమ్మిడివరంలోని జిల్లాశాఖ కార్యాలయంలో సోమవారం ఎస్ఎన్ మునేశ్వరరావు అధ్యక్షతన ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లాశాఖ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని, ఐఆర్‌ను వెంటనే అందించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు అప్పగించరాదని వారు డిమాండ్ చేశారు. అనంతరం కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న మడికి నాగభూషణంకు స్కూలు అసిస్టెంట్ పీడీగా పదోన్నతి లభించిన సందర్భంగా ఆ ఉపాధ్యాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో యు.వెంకట్రావు, జీవీవీ సత్యనారాయణ, గుత్తాల వెంకటేశ్వరరావు, మోర్త రాజశేఖర్, వీధి రాజశేఖర్, పినిపే కృష్ణమూర్తి, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

పల్లకీ సేవ

మలికిపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా లక్కవరంలో సోమవారం సత్యసాయిబాబాకు పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్యసేవ, గర్భిణులకు సీమంతాలు, మాతృపూజ, బాలవికాస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల కొండబాబు, డాక్టర్ ప్రభాకర్, మంగెన సత్యగురునాథ్, అంకం సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి

పి.గన్నవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన వరద ఉధృతి తగ్గడంతో ధవళేశ్వరం వద్ద వరద తగ్గుముఖం పట్టింది. దిగువన వశిష్ఠ, వైన తేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయలు కాస్త శాంతించినప్పటికి ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే, కె.ఏనుగుపల్లి కాజ్‌వే, గంటిపెదపూడి ఏటిగట్టు దిగువన ఉన్న కాజ్‌వేలు ముంపు నుంచి బయటపడంతో లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెల వారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడి లంకగ్రామస్తులు బోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు.

విద్యా దాత అడబాల మృతి



మలికిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కేశనపల్లికి చెందిన విద్యా దాత అడబాల భాస్కరరావు మృతిచెందారు. ఆయన పలు విద్యా సంస్థలకు సహకారం అందించడంతో పాటు పలు ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం



ఈదరపల్లిలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న నల్లా శ్రీధర్ తదితరులు

అమలాపురంరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడిని పూజిద్దామని నినాదంతో కోనసీమ ఆహారనిధి, పవన్‌కల్యాణ్ భావ సారూప్యంతో సోమవారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేపట్టారు. బండారు సురేష్, అద్దంకి సత్యప్రసాద్ (చిన్నా) ఆధ్వర్యంలో ఈదరపల్లిలో జరిగిన కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. అనంతరం అమలాపురం మహిపాలవీధి లక్ష్మీగణపతి ఆలయం వద్ద ప్రతిమలను పంపిణీ చేశారు. ఆయాకార్యక్రమాల్లో అడపా కోటేశ్వరరావు, మోరం శివన్నారాయణ, జక్కంపూడి త్రిమూర్తులు, అద్దంకి చంద్రరావు, అడపా శ్రీను, ర్యాలి గోవిందరావు, అడపా ప్రకాష్, చింతపల్లి చిన్నా, మోరం బుజ్జి, గట్టెం వీరు, పోలిశెట్టి పవన్‌మహేష్ పాల్గొన్నారు.

అలాగే అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబులు ఉచితంగా వినాయక ప్రతిమలను వందలాదిగా పంపిణీ చేశారు. అసోసియేషన్ ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం, అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూర్యప్రభాకరరావు, కోశాధికారి శ్రీఘాకోళపు రాంపండు, కోఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్, వరదా రాంబాబు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ పుట్టినరోజు సందర్భంగా ఐ.పోలవరంలో సోమవారం టీడీపీ, జనసేన కార్యకర్తలు భక్తులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలను వాడాలని కోరారు. కార్యక్రమంలో జనసేనగ్రామ కమిటీ కన్వీనర్ దేవు రాంబాబు, టీడీపీ కన్వీనర్ పిన్నమరాజు శివ, సొసైటీ డైరెక్టర్లు మద్దిరెడ్డి కుమార్, చోడిశెట్టి వీరబాబు, పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక ప్రతిమలు వాడి పర్యావరణాన్ని కాపాడుదామంటూ పెదపట్నంలంక గ్రామానికి చెందిన యువకులు మట్టి ప్రతిమలను గ్రామంలో సోమవారం పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న మండపాల వద్ద విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పినిశెట్టి లీల, యేడిద రాజేష్, కామిరెడ్డి దుర్గారావు, గిడుగు బాలాజీ, పైడిపర్తి రవితేజ, యేడిద సురేంద్ర పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వేదవిద్యా సంస్థల కార్యదర్శి ఏపీఎస్ఎస్ రవికుమార్, గాయత్రీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత గుర్రం నాయుడు అన్నారు. తాటిపాకలో వేద జూనియర్, డిగ్రీ కళాశాలలో మట్టి వినాయకున్ని పూజిద్దాం కార్యక్రమం నిర్వహించారు. మట్టి గణనాథులను విద్యార్థులు, సిబ్బందికి అందజేశారు. డైరెక్టర్ కంచి సూర్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సోమేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాపన్న, ఏవో రామరాజుపాల్గొన్నారు.

సామాన్యులకు రక్షణ కవచం పోలీస్

ఉప్పలగుప్తం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సామాన్యులకు పోలీసులు రక్షణ కవచమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండలానికి చెందిన పాము గౌతమ్‌కృష్ణ, అంబటి భాగ్యలక్ష్మి, జనిపెల్ల శాంతిశ్రీ, యాళ్ళ రత్నం, జల్లి సురేష్, గెడ్డం చిట్టిబాబు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చల్లపల్లి సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే వారిని సన్మానించారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, దళిత ఐక్యవేదిక నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు, అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ చలమల రాజేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, దళిత ఐక్యవేదిక సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు

అంబాజీపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు పరిధి గుంటమామిడితోటలో ఉన్న ప్రైమరీ స్కూల్‌ను ఆదర్శ పాఠశాల తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రూ.12లక్షలు దుర్వినియోగమైనట్టు గ్రామానికి చెందిన నాయకుడు నెల్లి వెంకటరమణ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈనిధులతో కనీసం పాఠశాలలో మరుగుదొడ్లను కూడా నిర్మించలేదని ఆరోపించారు. సిమెంట్ గడ్డ కట్టి టైల్స్, వాటర్ పైపులు నిరుపయోగంగా పాఠశాలలో పడిఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలతో తహశీల్దారు చినబాబుకు ఫిర్యాదు చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామదేవత ఆలయ పునర్నిర్మాణానికి రూ.5లక్షల విరాళం



అంబాజీపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ముక్కామలలో గ్రామదేవత ఆలయ పనర్నిర్మాణానికి గ్రామానికి చెందిన బండారు శివకుమార్ రూ.5లక్షల విరాళాన్ని అందించారు. డీఎల్ ఎన్ సోమయాజులు-సుభద్ర దంపతులు, కుటుంబసభ్యులు పోతుకూచి జయంత్‌కుమార్ అచ్యుతమనీ రూ.లక్ష, దువ్వూరి కృష్ణమూర్తి, వెంకటశిరీష దంపతులు రూ.లక్ష, శేషాద్రిశాస్త్రి హేమలత దంపతులు రూ.లక్ష అందించారు.

నరసింహస్వామిని దర్శించుకున్న వినుకొండ ఎమ్మెల్యే

అంతర్వేది, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని సోమవారం వినుకొండ ఎమ్మెల్యే జి.వెంకటశివ సీతారామాంజనేయులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ స్వామివారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వేతనాల కోసం యానాంలో మున్సిపల్ ఉద్యోగులు సోమవారం పరిపాలనాధికారి కార్యాలయానికి సమీపంలో నిరసన చేపట్టారు. వేతనాలు లేకఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే ప్రత్యేక ప్యాకేజ్ కేటాయించాలని కోరారు. అలాగే విశ్రాంతి ఉద్యోగులకు బకాయి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది ఆందోళన చేపట్టారు. మున్సిపల్ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు, నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



అంబాజీపేటలో రహదారి అభివృద్ధికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రహదారిని కూటమి ప్రభుత్వంలో కొత్త రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కొర్లపాటివారిపాలెం వనువులమ్మ ఆలయం వద్ద నుంచి నాబార్డు నిధులు రూ.1.10కోట్లతో రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, సుంకర బాలాజీ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, మట్టపర్తి సోమేశ్వరరావు, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం 33-11కేవీ పరిధిలోని పి.గన్నవరం నుంచి నరేంద్రపురం సబ్‌స్టేషన్ వరకు నూతనలైన్ కోసం టవర్ల ఏర్పాటుకు మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. నరేంద్రపురం గ్రామ పరిధిలో ఆరు టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. గంటిపెదపూడి, ఉడిమూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, నరేంద్రపురం, కుందాలపల్లి, రాజులపాలెం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి 12గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

మలికిపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రామరాజులంక జడ్పీ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన, శక్తి యాప్‌పై మలికిపురం ఎస్ఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, బంగార్రాజు, బి.శ్రీనివాస్, ఏపుగంటి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

అంతర్వేది, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అంతర్వేది గ్రామపంచాయతీ వద్ద క్షయ ముక్త భారత కార్యక్రమాన్ని రామేశ్వరం వైద్యాధికారిణి డాక్టర్ సూరజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. క్షయవ్యాధి పట్ల ప్రజలు అవగాహన కల్పించారు. 30మందికి నుంచి కళ్లెను స్వీకరించారు. సర్పంచ్‌లు పోతురాజు నరసింహారావు(కిశోర్), కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, లలిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

అంబాజీపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముక్కామల పీహెచ్‌సీ అభివృద్ధికి నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీహెచ్‌సీ భవనం, ఇతర అభివృద్ధి అంశాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.సుమప్రియ, నాయకులు బండారు మల్లిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంరక్షణ పోలీస్‌కు స్కూల్‌అసిస్టెంట్ ఉద్యోగం



అంబాజీపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మాచవరం సచివాలయంలో-1లో మహిళా సంరక్షణ పోలీస్‌గా పని చేస్తోన్న గుత్తుల దుర్గాదేవి డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు కేటగిరిలో 82.37 మార్కులతో 7వ ర్యాంకు సాధించారు. టీజీటీ తెలుగు జోన్-2లో 7వ ర్యాంకు, పీజీటీ తెలుగు జోన్-2లో 13వ ర్యాంకు సాధించినట్లు ఆమె తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

డీఎస్సీలో గెద్దాడ కుర్రోడు ప్రతిభ



మామిడికుదురు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గెద్దాడకు చెందిన కె.మణికృష్ణ రెండు ఉద్యోగాలు సాధించాడు. డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్‌లో 3వ ర్యాంకు, పీఈటీలో 9వ ర్యాంకు సాధించి రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. స్కూల్ అసిస్టెంట్‌గా చేరతానని తెలిపారు. అతడిని పలువురు అభినందించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

పి.గన్నవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్‌లో 1994-95లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రాత్రి లంకలగన్నవరంలో కలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ప్రతి ఏడాది కలుసుకుని నిర్ణయం తీసుకున్నారు. ఈ కలయికకు కృషిచేసిన స్నేహితులు వట్టం రామచంద్రశేఖర్, పొదలాడ శ్రీనివాసరావులకు అభినందనలు తెలిపారు.

సిద్ధివినాయకుని ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అయినవిల్లి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి సిద్ధివినాయకుడిని సోమవారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి: ఎస్ఐ

అంబాజీపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):వినాయకచవితి మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ కె.చిరంజీవి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళా సంరక్షణ పోలీసులతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తుచేస్తే క్యూఆర్ కోడ్‌తో ఉన్న అనుమతి ప్రతాన్ని అందిస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు.

మట్టి, ఆకులతో వినాయకుని ప్రతిమలు

అంతర్వేది, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో మట్టి, పచ్చటి ఆకులతో వినాయకుని ప్రతిమలను తయారు చేశారు. పరిసరాలు కాలుష్యం కాకుండా పండుగలు నిర్వహించుకోవాలని శృంగవరప్పాడు, పడమటిపల్లి పాఠశాల హెచ్‌ఎంలు కొప్పిశెట్టి శ్రీదుర్గ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి, ఆకులతో వినాయకుని ప్రతిమలు తయారు చేశారు.



కోటిపల్లి పుష్కరాల రేవు వద్ద తగ్గుముఖం పట్టిన వరద

శాంతిస్తున్న గోదావరి

కె.గంగవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నాలుగు రోజులుగా గోదావరి ఉధృతంగా ప్రహిహిస్తూ తీవ్ర భయాందోళనకు గురి చేసింది. గోదావరి ఉధృతి కారణంగా పుష్కరాలరేవు, ఫెర్రీ రేవు, మత్స్యకార కాలనీ వరద నీటిలో చిక్కుకున్నాయి. సోమవారం సాయంత్రానికి కోటిపల్లి వద్ద మూడు అడుగులు తగ్గినా ప్రవాహం ఉధృతంగానే ఉంది. ఫెర్రీ రేవు, పుష్కరాల రేవు ఇంకా వరద నీటిలోనే చిక్కుకుని ఉన్నాయి. వరద తగ్గుముఖం పడుతుండటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నిడదవోలుకు చెందిన నడుంపల్లి పేర్రాజు, సూర్యకుమారి దంపతులు రూ.25,115, పిఠాపురం తహశీల్దారు పి.గోపాలకృష్ణ, గీత దంపతులు రూ.25,116, కపిలేశ్వరపురానికి చెందిన కె.వెంకటేశ్వరరావు, ప్రమీల దంపతులు రూ.29,999 విరాళాలు ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటంతో పాటు, తీర్థ ప్రసాదాలను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు అందజేశారు.



విరాళం ఇస్తున్న తహశీల్దారు గోపాలకృష్ణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అద్దంకివారిలంకను కొత్తపేటలో విలీనం చేయాలి



అద్దంకివారిలంక గ్రామసభలో మాట్లాడుతున్న వక్తలు

కపిలేశ్వరపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అద్దంకివారిలంక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం అద్దంకివారి లంక గ్రామాన్ని కొత్తపేట నియోజకవర్గంలో విలీనం చేయాలంటూ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాతి గవరయ్య అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం పార్టీలకతీతంగా పంచాయతీ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కార్యదర్శి బ్రహ్మాజీరావు, గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పేర్రాజు పంతులు ఎడ్యుకేషన్ ట్రస్టు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం దృశ్యం

కృత్తివెంటి ఆశయసాధనకు కృషి చేద్దాం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కృత్తివెంటి పేర్రాజు పంతులు ఆశయసాధనకు కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు ధర్మకర్తల మండలి కృషి చేయాలని మంత్రి సుభాష్ కోరారు. సోమవారం ఉదయం అగస్త్యేశ్వరస్వామి, సాయంత్రం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు ధర్మకర్తల మండళ్ల ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేర్రాజు పంతులు వంటి మహోన్నతులు రాష్ట్రంలో మరొకరు ఉండరన్నారు. రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలగా నామకరణం చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్‌గా సలాది వెంకప్పనాయుడు, సభ్యులుగా శిరిగినీడి దుర్గా ప్రసాద్, కొండపల్లి రవికుమార్, నరాల సురేష్, బాలాంత్రపు సరస్వతి, అంపోలు వరలక్ష్మీ, బండి సత్యవాణి, ముచ్చుమిల్లి సుజాత ప్రమాణ స్వీకారం చేశారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో: ఉదయం అగస్త్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చెరుకుపల్లి వెంకట రామగణేష్ శర్మ, ధర్మకర్తలుగా సుతాపల్లి వీరవెంకట సుబ్రహ్మణ్యం, కిల్లి వెంకటగిరి, శాకా వీరన్న, వాసంశెట్టి సత్యనారాయణ, ఆదివరపు ధనలక్ష్మీ, తొగరు లక్ష్మీమ, మన్ని దుర్గాలక్ష్మీ, లంక వెంకటదుర్గ, కొత్తలంక ఎర్రయ్యశాస్త్రి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్, ఈవో సత్యనారాయణ, టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, జాస్తి విజయలక్ష్మీ, వుండవిల్లి శివ, కడియాల రాఘవన్, కంచుమర్తి బాబూరావు, జనసేన నాయకులు గొల్లపల్లి కృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రాయవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండపేట సబ్ యూనిట్ ఆఫీసర్ వీడీడీ బిషప్ సూచించారు. సోమవారం చెల్లూరు గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. చింతలతోట వద్ద వైద్యుడు మణికంఠ ఆధ్వర్యంలో ఇంటింటికి పర్యటించి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. గ్రామంలో పర్యటించి జ్వరా లు ఉన్నాయా అనే విషయాన్ని ఆరా తీశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఇమాన్యుయేల్, ఆశా వర్కర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో వైద్య శిబిరం

రాయవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్, ఎంఈవో కార్యాలయాల ప్రాంగణంలో సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి ప్రతినిధులు ఎస్.దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, ప్రజలకు సుమారు 65 మందికి బీపీ, షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు జరిపి ఐదుగురికి వైద్య సేవలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, సోమేశ్వరం జనసేన నాయకుడు శాకా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపుదలకు కృషి చేయాలి

రాయవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్షా ఏఎంవో పిల్లి రాంబాబు పిలుపునిచ్చారు. సోమవారం రాయవరం రాజేశ్వరకాలనీలో మోడల్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాలను ఏఎంవో సందర్శించారు. 1, 2వ తరగతుల్లో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసి సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల్లో పునాది అభ్యాసనం బాగుంటేనే పై తరగతుల్లో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. 5వ తరగతి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను ఏఎంవో పరిశీలించారు. పాఠశాలలో ఎఫ్ఏ-1 జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం లచ్చిరెడ్డి వెంకటరమణ, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన తీరును తెలుసుకుంటున్న ఏఎంవో రాంబాబు



చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

వర్తక, వాణిజ్య కేంద్రంగా రామచంద్రపురం

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురాన్ని వర్తక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దుతానని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం పట్టణంలో మహాలక్ష్మీనగర్‌లో నిర్మించిన చాంబర్ ఆఫ్ కామర్స్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురాన్ని వర్తక, వాణిజ్య రంగాలతో పాటు అన్ని విభాగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.కోటితో చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం నిర్మించిన చాంబర్ అధ్యక్షుడు కొవ్వూరి తాతారెడ్డిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొవ్వూరి తాతారెడ్డి, ఉపాధ్యక్షుడు కంచుమర్తి బాబూరావు, కార్యదర్శి పసుపులేటి సత్తిబాబు, గౌరవ అధ్యక్షుడు మూర్తి, యూనియన్ల నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు మంత్రి సుభాష్, ఎ.రిష్వంత్‌రాయ్, పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిలను చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సత్కరించారు.



ఆత్రేయపురం వేణుగోపాలస్వామి, రాజరాజేశ్వరి దేవస్థానాల పాలకమండలి ప్రమాణ స్వీకారం దృశ్యం

ఆలయాలకు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ఆత్రేయపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా వేగేశ్న వెంకటసత్య ప్రసాదరాజు, 9 మంది సభ్యులు, రాజరాజేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా పులవర్తి కాశీవిశ్వనాధం, 9 మంది ధర్మకర్తల మండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యనిర్వహణాధికారి నరేంద్ర వారితో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ ముదునూరి వెంకట్రాజు, మాజీ ఎంపీపీ వీఎస్ రాజు, జనసేన నాయకుడు చేకూరి కృష్ణంరాజు తదితరులు వారిని అభినందించారు.

యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

మండపేట, ఆగస్టు, 25(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై దృష్టిసారించి రైతులకు సక్రమంగా అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం అమరావతిలో వున్న వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ డిల్లీరావును కలిసి యూరియా కొరత లేకుండా చూడాలని ఆయన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌నేతలు, సింగం రామకృష్ణారెడ్డి, రేపాల మోహనరావు, మీసాల బాబురావు, తమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపర్చేందుకు కృషి

రావులపాలెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నట్లు సిద్ధార్థ పాఠశాల డైరెక్టర్ కె.ముల్లారావు అన్నారు. పాఠశాలలో సోమవారం ఆయన రేడియో స్టేషన్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు వీటి ద్వారా ఎంతో నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపల్ అనిలా, ఆశీర్వాదం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రేడ్-1 ఈవోగా రాపాకకు పదోన్నతి



ఆత్రేయపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ సూపరింటెండెంట్ రాపాక శ్రీనివాస్ గ్రేడ్-1 ఈవోగా పదోన్నతి పొందారు. సోమవారం రాష్ట్ర దేవదాయ కమిషనరు రామచంద్రమోహన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఈవోగా పదోన్నతి పొందడంతో ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది సత్కరించారు.

ఉన్నత పాఠశాలలో బాత్‌రూమ్స్ ప్రారంభం

కె.గంగవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద దాత సహకారంతో నిర్మించిన బాత్‌రూమ్స్‌ను సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఎస్.సత్యనారాయణ తన సొంత ఖర్చులతో మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. దాత చేతులమీదుగా వాటిని ప్రారంభించారు.





రాయవరం మండలం పసలపూడిలో మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో ఆత్రేయపురం మండలం రాజవరంలో మట్టి వినాయకుడి ప్రతిమలతో విద్యార్థుల ర్యాలీ

మట్టి వినాయకులను పూజిద్దాం

రాయవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని సోమవారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహించారు. గ్రామానికి చెందిన ద్వారంపూడి రామచంద్రారెడ్డి వితరణతో పర్యావరణ పరిరక్షణ కోసం 500 మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులు, గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలు వాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు అవగాహన

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం బి.రాజకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో మట్టివినాయక ప్రతిమలతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వినాయక మట్టి ప్రతిమలపై అవగాహన కల్పించారు.

మట్టి ప్రతిమల పంపిణీ

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. రావులపాలెం తహశీల్దారు కార్యాలయం వద్ద సోమ వారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తూ పర్యావరణాన్ని పరిరక్షిద్దామం టూ నినాదాలను చేశారు. కార్యక్రమం లో తహశీల్దారు ముక్తేశ్వరరావు, కాశీఅన్నపూర్ణ సేవా సంస్థ అధ్యక్షులు గొలుగూరి సతీష్‌రెడ్డి, పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కొవ్వూరి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం నిర్వహించే చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని గ్రామాల్లోని గణపతి ఆల యాలు, ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేసి విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): చవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పామర్రు ఎస్ఐ ఎస్.కె జానీబాషా అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులతో సమావేశం జరిపారు. చవితి మండపాలు ఏర్పాటు చేసుకునే వారు రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతి ఇస్తామన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలు ఏర్పాటు చేయబోమని రాసివ్వాలన్నారు. నిమజ్జనం చేసే తేదీ, సమయం తమకు తెలియజేయాలన్నారు.



రావులపాలెంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



కె.గంగవరంలో చవితి మండపం నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ ఎస్‌కె జానీబాషా

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలి



ద్రాక్షారామలో ప్రదర్శన జరుపుతున్న అఖిలపక్ష జేఏసీ నాయకులు

ద్రాక్షారామ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ద్రాక్షారామలో ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా అఖిలపక్ష జేఏసీ నాయకులు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని అమలాపురంలో కలపడం తప్పిదమన్నారు. కాకినాడ జిల్లా కేంద్రానికి రామచంద్రపురం కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. జిల్లాల పునర్విభజన కమిటీ దీన్ని సరిదిద్ది రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కాకినాడ జిల్లాలో కలపాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రదర్శన అనంతరం బోసుబొమ్మ సెంటర్‌లో ధర్నా చేశారు. ప్రదర్శనలో వర్తక వాణిజ్య సంఘాలు, ఆటో యూనియన్లు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్ధూ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి బీమశంకరం, ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ మాధవరపు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకురాలు శారద, పీడీఎస్‌యు నాయకులు నవీన్, ఏఐకెఎంఎస్ నాయకులు రాజారెడ్డి, పలు ఆటో యూనియన్ నాయకులు, విద్యా సంస్థల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో కలపాలని తీర్మానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ రామచంద్రపురం, కె.గంగవరం మండలంలో సహకార సంఘాల త్రీమన్ కమిటీలు తీర్మానించాయి. సోమవారం రామచంద్రపురం ఆర్డీవోను కలిసి తీర్మానాల నకళ్లు, వినతి పత్రాలను పీఏసీసీఎస్‌ల చైర్మన్లు, సీఈవోలు, ఉద్యోగులు అందచేశారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్లు ముప్పనపల్లి గణేష్, పెంకె గోవిందరాజులు, ఎం.జానకిరామయ్య, ఎస్.సత్యనారాయణమూర్తి, గడ్డం పల్లపురావు, నూనె లక్ష్మయ్య, కె.కోదండరాముడు, ఎం.రాధాకృష్ణమూర్తి, సీఈవోలు పి.సత్యనారాయణ, పిల్లి శ్రీనివాసరావు, పి.ఈశ్వరుడు, బాబి, వీరాంజనేయులు, సూర్యప్రకాశరావు, జి.సూరిబాబు, ఎస్.శ్రీరాములు, జి.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగులో డ్రోన్‌తో పిచికారి

ఆత్రేయపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): లొల్ల గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పిచికారి విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ప్రకృతి సాగు పద్ధతిలో పురుగు మందులు వాడకుండా కషాయాలతో రైతులు సాగు చేసే విధానాన్ని అవలంబిస్తున్నారు. ప్రస్తుతం వరి ప్రకృతి సాగు చేపడుతున్నారు. దీనికి సంబంధించిన కషాయాలను తయారు చేశారు. సుమారు 20 ఎకరాల వరిపొలంలో డ్రోన్ ద్వారా పిచికారి చేసి సాగు చేపట్టే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్ సరఫరా చేస్తున్నట్లు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గంగాభవాని, సాగర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.



లొల్లలో ప్రయోగాత్మకంగా డ్రోన్‌తో పిచికారి నిర్వహిస్తున్న దృశ్యం



పర్యావరణ పరిరక్షణకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేయూత

కె.గంగవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సలాది ప్రసన్నకుమార్ పర్యావరణ పరిరక్షణకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేసి సోమవారం గ్రామంలో పాఠశాల విద్యార్థులతో కలిసి 500 విగ్రహాల పంపిణీ చేపట్టారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు.

సాగునీటి సంఘం అధ్యక్షుడికి రైతుల సత్కారం

ఆలమూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో దశాబ్దాల కాలంగా మురుగునీరు కాలువల తవ్వకాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతుల బాధలను గుర్తించి చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు ఆ కాలువలో పూడికను తొలగించి అభివృద్ధి చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలంనాటి సమస్యను పరిష్కరించిన సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావును పెనికేరులో పెనికేరు, జొన్నాడ, కలవచర్ల రైతులు సత్కరించారు. ఆయన చేసిన సేవలను ప్రశంసిస్తూ శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు గుత్తుల శ్రీనివాస్, సుబ్బారెడ్డి, రాముతోపాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఆలమూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్లలో సోమవారం పేకాట శిబిరంపై ఆలమూరు పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న అందిన సమాచారం మేరకు ఆలమూరు ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,650 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఎవరైనా పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాన్నారు.



మహిళకు ఎగ్‌కార్ట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, నెక్ సభ్యులు

ఎగ్‌కార్టుతో మహిళలకు అదనపు ఆదాయం

మండపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పించడంతోపాటు అదనపు ఆదాయం పొందేలా ప్రభుత్వం ఎగ్‌కార్టులను ప్రారంభించారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. జెడ్.మేడపాడుకు చెందిన మహిళకు మంజూరైన ఎగ్‌కార్ట్ యూనిట్‌ను సోమవారం పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, సాగునీటి సంఘ అధ్యక్షుడు బాబు, నెక్ సభ్యులు పడాల రామకృష్ణారెడ్డి, మేకా శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో లయన్స్ భాగస్వాములు కావాలి

మండపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) సమాజ సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే వేగుళ్ల పిలుపునిచ్చారు. పట్టణ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక లయన్స్ క్లబ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఈ సందర్భంగా కార్యవర్గాన్ని అభినందించారు. క్లబ్ తరపున అన్నక్యాంటీన్ నిర్వహణకు రూ.75వేలు విరాళాన్ని ఆయనకు అందజేశారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడుగా బీవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా ఐవీ నాగేంద్రబాబు, కోశాధికారిగా చెన్నా రాంబాబు, ప్రమాణ స్వీకారం చేశారు.



రావులపాలెం తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నిధులు రికవరీ చేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం

రావులపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పంచాయతీలో గతంలో దుర్వినియోగం జరిగిన నిధులను రికవరీ చేయాలంటూ ఆగ్రామ మాజీ సర్పంచ్ నామాల నాగేశ్వరావు గ్రామస్తులతో కలిసి రావులపాలెం తహశీల్దార్ ముక్తేశ్వరావుకు వినతి పత్రం అందజేశారు. ముందుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 నుంచి 2024 వరకు కొబ్బరి ఫలసాయం, ఇంటి పన్నులు, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. పాలకవర్గం అనుమతులు లేకుండా నిధులు ఖర్చు చేశారని వారు ఆరోపించారు. దుర్వినియోగం చేసిన నిధులను వెంటనే జమ చేయాలన్నారు. జమ కాని పక్షంలో సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, కార్యదర్శి ఫణికుమార్, మరో ఉద్యోగి గంగులీలపై చర్యలు తీసుకోవాలంటు తహశీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరినట్టు వారు తెలిపారు.